
సాక్షి
బాపట్ల
శనివారం, 20 ఏప్రిల్, 2024



నేడు దోకిపర్రులో ఆలయ వార్షికోత్సవం

మేడికొండూరు: దోకిపర్రులోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ 14వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించనున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 507.90 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,496 క్యూసెక్కులు విడుదలవుతోంది.



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మను రాష్ట్ర ఎన్నికల వ్యయ పరిశీలకుడు సౌరభ్‌శర్మ శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఆయనకు అధికారులు స్వాగతం పలికారు.

న్యూస్‌రీల్

చందోలులో ఘనంగా హరిద్ర శృంగారార్చన



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలులో గల శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం హరిద్ర శృంగారార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ అమ్మవారి దేవాలయంలో ప్రతి శుక్రవారం మగ పిల్లలకు దోషాలు తొలగి శీఘ్రంగా వివాహం జరగడానికి గానూ ప్రత్యేకంగా హరిద్ర శృంగార్చనను పసుపు కొమ్ములతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బండ్లమ్మ వారిని మహా గౌరీ దేవిగా అలంకరించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు పర్యవేక్షించారు.

వైభవంగా ఊయల సేవ



తెనాలి అర్బన్: శ్రీ క్రోధి నామ సంవత్సర చైత్ర మాస ఏకాదశి సందర్భంగా బోసు రోడ్డులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామికి అర్చకులు రొంపిచర్ల చక్రవర్తి శుక్రవారం ప్రత్యేక పూజలు, ఉయ్యాల సేవను వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామికి అర్చన, అనంతరం సంకీర్తన కార్యక్రమాలు జరిపారు. కార్యక్రమాల్లో ఉభయదాతలు అందె బాలచంద్రమౌళి, రాజేశ్వరి, తన్మయి, కొండపి వసుంధర పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమం కోసం పోరాడిన గౌతు లచ్చన్న



సత్తెనపల్లి: ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలూ పోరాడిన కారణజన్ముడు సర్దార్ గౌతు లచ్చన్న అని బీసీ సంఘాల నాయకులు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా పట్టణంలోని వడ్డవల్లి పోలేరమ్మ తల్లి గుడి వద్ద బీసీ సంఘ నాయకుడు ఉప్పాల విజయ్ ఆధ్వర్యంలో శుక్రవారం గౌతు లచ్చన్న చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. బీసీ సంఘ నాయకులు మాట్లాడుతూ దేశంలో సర్దార్ అనే బిరుదు వల్లభాయ్ పటేల్, గౌతు లచ్చన్నకు మాత్రమే ఉందన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు తుళ్లూరు నరసింహారావు, కంటూ వెంకట్రామయ్య, కొమర పాపారావు, పత్తిపాటి హరేకృష్ణ, జల్లెడ రాములు, పిక్కల శివ, ఉప్పాల గోవిందమ్మ, చింకా అంకమ్మరావు, తుళ్లూరి బాల చెన్నయ్య, ఆరేపల్లి పెద్దబాబు, తుళ్లూరి రమేష్ బాబు, బి కమలాకర్, షేక్ చిన్న షరీఫ్, కొమర నరసింహారావు, తుళ్లూరి అర్జున్‌రావు, బైలడుగు కృష్ణంరాజు, మల్లాల గురవయ్య, చింతపల్లి లాజర్, కె.దస్తగిరి, గుంటూరు గోవిందు, గొట్టం వెంకటేష్, చావల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

యార్డులో 77,908 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 67,994 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 77,908 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.17,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 19,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 59,032 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4800, గరిష్ట ధర రూ.6500, మోడల్ ధర రూ.5700 వరకు పలికింది.

సంకుల సమరంలో సమ న్యాయం

- అధికార వైఎస్సార్ సీపీకి సామాజిక న్యాయం అండ
- టికెట్ల కేటాయింపులో అన్ని కులాలకు సమ న్యాయం
- వేమూరు, సంతనూతలపాడు ఎస్సీకి, రేపల్లె గౌడకు, బాపట్ల బ్రాహ్మణులకు, చీరాల కమ్మకు పర్చూరు కాపు, అద్దంకి రెడ్డికి కేటాయింపు
- పర్చూరు, అద్దంకి, రేపల్లెలో కాపు, రెడ్డి, గౌడకు మొదటి అవకాశం
- వైఎస్సార్ సీపీ నిర్ణయంపై జిల్లాలో సర్వత్రా హర్షం



బాలాజీ పర్చూరు | ఈపూరి గణేష్ రేపల్లె | చిన హనిమిరెడ్డి అద్దంకి | అశోక్‌బాబు వేమూరు | రఘుపతి బాపట్ల | వెంకటేష్, చీరాల | నాగార్జున సంతమాగులూరు


సాక్షి ప్రతినిధి, బాపట్ల: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికలో అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సామాజిక సమీకరణలకు పెద్దపీట వేసింది. సీట్ల కేటాయింపుల్లో అన్ని కులాలకు సమ న్యాయం పాటించడంతో ఆయా సామాజిక వర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. బాపట్ల పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఎస్సీకి రెండు, మిగిలిన స్థానాల్లో గౌడ, బ్రాహ్మణ, కమ్మ, కాపు, రెడ్డి సామాజిక వర్గాలకు ఒక్కొక్క సీటు కేటాయించి సామాజిక న్యాయం పాటించింది. ఈ క్రమంలో జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని వర్గాలవారూ రానున్న ఎన్నికల్లో అధికార పార్టీకి మద్దతు పలకనున్నారని రాజకీయ పరిశీలకుల అంచనా. ఈ నిర్ణయం ఎన్నికల్లో ఆ పార్టీకి మరింతగా కలిసి రానుందని భావిస్తున్నారు. పార్టీ విశాల దృక్పథాన్ని ప్రజలు కూడా స్వాగతిస్తున్నారు. అన్ని సామాజికవర్గాల ఓటర్లు కూడా దీన్ని సమర్థిస్తున్నారు. ఈ నిర్ణయం ఎన్నికల్లో విజయతీరాలకు చేరుస్తుందని వారు పేర్కొంటున్నారు. వైఎస్సార్ సీపీ ఎంపిక ప్రక్రియ అభ్యర్థుల విజయానికి కూడా దోహద పడుతుందని పార్టీ శ్రేణులు కూడా ధీమాతో ఉన్నాయి.

రేపల్లెలో గౌడలకు అండ




రేపల్లె నియోజకవర్గంలో టీడీపీ ఆవిర్భావం తర్వాత తొమ్మిది సార్లు ఎన్నికలు జరిగాయి. గత రెండు ఎన్నికల్లో మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన మోపిదేవి వెంకటరమణను వైఎస్సార్ సీపీ పోటీ చేయించింది. తాజా ఎన్నికల్లో అధికంగా ఓటర్లు ఉన్న గౌడ సామాజికవర్గానికి చెందిన ఈవూరి గణేశ్‌ను బరిలో నిలిపింది. దీంతో ఇక్కడ గౌడ సామాజిక వర్గంతో పాటు అన్ని వర్గాలకు చెందిన వారూ అధికారపార్టీకి మద్దతుగా నిలువనున్నారు.

కాపులకు పెద్దపీట



పర్చూరు నియోజకవర్గంలో 1983 టీడీపీ ఆవిర్భావం తరువాత పదిసార్లు ఎన్నికలు జరిగాయి. 1994లో మినహా ఆ పార్టీ అన్ని సార్లూ కమ్మ సామాజిక వర్గం వారిని అభ్యర్థులుగా నిలిపింది. గత రెండు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కూడా కమ్మ సామాజికవర్గం వారిని అభ్యర్థులుగా నిలిపింది. అయితే, ఈ ఎన్నికల్లో వ్యూహాన్ని మార్చింది. కాపులకు అవకాశం కల్పించింది. నియోజకవర్గంలో 20 వేల ఓట్లున్న కాపు సామాజిక వర్గానికి చెందిన యడం బాలాజీని ఎన్నికల బరిలో నిలిపింది. దీంతో ఆ సామాజికవర్గంతో పాటు మిగిలిన వారూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కమ్మకు అవకాశం



చీరాల నియోజకవర్గంలో గత రెండు ఎన్నికల్లో కాపు సామాజికవర్గానికి అవకాశం కల్పించిన అధికార పార్టీ ఈసారి కమ్మలకు అవకాశం కల్పించింది. ఆ సామాజిక వర్గానికి చెందిన బలమైన నేత కరణం బలరామకృష్ణమూర్తి కుమారుడు వెంకటేశ్‌కు సీటు కేటాయించింది. ఈ నియోజకవర్గంలో టీడీపీ ఆవిర్భావం తర్వాత కాపు, యాదవ, వైశ్య, చేనేత, కమ్మ వర్గాలకు అవకాశం కల్పించారు. 1962, 2019 ఎన్నికల్లో మాత్రమే కమ్మ సామాజిక వర్గం అభ్యర్థులు పోటీలో ఉన్నారు. తాజాగా వైఎస్సార్ సీపీ కమ్మ సామాజికవర్గానికి అవకాశం కల్పించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కరణం వెంకటేశ్ కు అవకాశం ఇవ్వడంతో ఈ ప్రభావం పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లోనూ ఉండనుంది. ఇది పార్టీకి విజయానికి ఎంతగానో దోహద పడనుంది.

బాపట్లలో కొత్త సమీకరణలు

బాపట్ల పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో వేమూరు, సంతనూతలపాడు నియోజకవర్గాలు ఎస్సీలకు కేటాయించారు. వైఎస్సార్ సీపీ ఆ సామాజిక వర్గానికి చెందిన బలమైన అభ్యర్థుల్ని ఎంపిక చేసింది. మిగిలిన ఐదు నియోజకవర్గాల్లో కొత్త పంథా తొక్కింది.

- అద్దంకి నియోజకవర్గం నుంచి మొదటి సారి రెడ్డి సామాజికవర్గానికి టికెట్ కేటాయించింది. గత రెండు ఎన్నికల్లో ఇక్కడ కమ్మ సామాజిక వర్గానికే కేటాయించారు. అయితే, నియోజకవర్గంలో ఎన్నికలు ప్రారంభమైన నాటినుంచి టికెట్ ఇవ్వని రెడ్డి సామాజిక వర్గానికి ఈ సారి సీటు ఇవ్వాలని అధికార పార్టీ నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని నియోజకవర్గంలోని అన్ని వర్గాల వారు స్వాగతిస్తున్నారు.



- రెడ్డి సామాజికవర్గం ఓటర్లు అధికంగా ఉన్న బాపట్ల నియోజకవర్గాన్ని అధికార పార్టీ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే కోన రఘుపతికి మూడో సారి సీటు కేటాయించింది. రాష్ట్రంలో బ్రాహ్మణ సామాజిక వర్గానికి సీటు కేటాయించడంతో జిల్లావ్యాప్తంగానే కాక రాష్ట్రవ్యాప్తంగా ఆ సామాజిక వర్గం అధికార పార్టీకి అండగా నిలువనుంది.

అయ్యో.. కొండయ్యకు కారు లేదట!

చీరాల: టీడీపీ చీరాల అసెంబ్లీ అభ్యర్థి ఎం.ఎం. కొండయ్య గడప దాటి అడుగు బయటపెడితే పెద్ద కాన్వాయే వెంట ఉంటుంది. ఆయనతో పాటు తనయులు, అనుచరులు, మందీమార్బలం రయ్‌మంటూ రోడ్లపై దూసుకెళ్తుంటారు. కొండయ్య తరఫున శుక్రవారం ఆయన కుమారుడు గౌరీ అమర్‌నాథ్ ఎన్నికల నామినేషన్ పత్రాలను చీరాల రిటర్నింగ్ ఆఫీసర్‌కు అందజేశారు. అఫిడవిట్‌లో తనకు కారు లేదని, కనీసం టూ వీలర్ కూడా లేదని పొందుపరచడం చర్చనీయాంశమైంది. ఆస్తులు, అప్పులు, స్థిర, చరాస్తులను చూపించిన కొండయ్య తనకు కార్లు లేవని ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొనడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

పర్చూరు అభ్యర్థి యడం బాలాజీ ఆస్తిపాస్తులు

చినగంజాం: వైఎస్సార్ సీపీ పర్చూరు అభ్యర్థి యడం బాలాజీకి బ్యాంకుల్లో రూ.12,16,662 , నాలుగు విదేశీ బ్యాంకుల్లో రూ.13,68,389 నగదు ఉంది. ఆయన భార్య పులగం హరిత పేరుపై చీరాలలో రూ.4,34,881, విదేశాల్లోని తొమ్మిది బ్యాంకుల్లో రూ.2.73 కోట్ల నగదు ఉన్నట్లు చూపారు. బాలాజీ పేరుపై చరాస్తులు రూ.1.44 కోట్లు, భార్య హరిత పేరుపై రూ.3.77 కోట్లు ఉన్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల్లో రూ.2.93 కోట్లు విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు. బ్యాంకు రుణాలు బాలాజీ పేరుపై రూ.1.20 కోట్లు, భార్య హరిత పేరుపై రూ.5.46 కోట్లు ఉన్నట్లు చూపారు. బాలాజీపై ఒక క్రిమినల్ కేసు ఉంది.

కోన ఆస్తుల విలువ రూ. 24.20 కోట్లు

బాపట్ల: అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎమ్మెల్యే కోన రఘుపతి తన కుటుంబ ఆస్తుల విలువను రూ.24.20 కోట్లుగా ఎన్నికల అఫిడవిట్‌లో చూపించారు. ఆయన పేరుతో రూ.10.63 కోట్లు, భార్య రమాదేవికి రూ.13.56 కోట్ల ఆస్తులు ఉన్నాయని పొందుపరిచారు. ఎలాంటి నేరచరిత్ర లేదని పేర్కొన్నారు. తన పేరిట ఓ ఆయిల్ ట్యాంకర్, రెండు కార్లు, భార్య రమాదేవి పేరుతో ఓ కారు ఉన్నట్లు తెలిపారు. వ్యవసాయ భూములు లేవని పేర్కొన్నారు. ఇద్దరికీ కలిపి బ్యాంకుల్లో రూ.1.41 కోట్ల రుణాలు ఉన్నాయని వెల్లడించారు.

కోలాహలంగా నామినేషన్ల పర్వం

- భావపురిలో ఫ్యాన్ ప్రభం'జనం'
- ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన నందిగం సురేష్
- రెండో సెట్ వేసిన ఎమ్మెల్యే కోన రఘుపతి
- కార్యకర్తలతో నిండిపోయిన బాపట్ల పురవీధులు



బాపట్లలో నామినేషన్ ర్యాలీలో నేతలు, కార్యకర్తల సందడి

సాక్షి ప్రతినిధి, బాపట్ల/ బాపట్ల: భావపురి ఫ్యాన్ ప్రభంజనంతో పులకరించింది. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎంపీ నందిగం సురేష్ నామినేషన్ వేస్తున్నారనే సమాచారంతో పురవీధులన్నీ కార్యకర్తలు, ప్రజలతో నిండిపోయాయి. తమ అభిమాన నేతలతో కలిసి నామినేషన్ కేంద్రం వరకు ప్రదర్శనగా వచ్చారు. స్థానిక రైసు మిల్లు నుంచి గడియారం స్తంభం మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. పట్టణ ప్రజలు భారీ గజమాలలతో స్వాగతం పలికారు. ఎర్రటెండలను సైతం లెక్క చేయకుండా ప్రదర్శనలో కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రదర్శన మూడు గంటల పాటు సాగిందంటే జన సందోహం ఏ విధంగా అర్థమవుతుంది. అనంతరం ఎమ్మెల్యే కోన రఘుపతి ఆర్వో శ్రీధర్‌కు రెండో సెట్ నామినేషన్ అందించారు. ఫ్యాన్ ప్రభంజనం వరుసగా మూడోసారి ఎన్నికల్లో కూడా స్పష్టంగా కనిపిస్తోందని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.

నమ్మకానికి వెన్నుపోటు రాజకీయాల మధ్య పోటీ: ఎమ్మెల్యే కోన

అన్ని సంక్షేమ పథకాలు అందించి ప్రజల నమ్మకాన్ని చవిచూసిన ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి అనునిత్యం నమ్మించి నట్టేటా ముంచిన వెన్నుపోటు పొడిచే చంద్రబాబునాయుడుకు మధ్య జరుగుతున్న పోటీగా ప్రజలు భావిస్తున్నారని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. మాట ఇచ్చాడంటే... చేసినట్లేనని నమ్మడంతోనే నేడు జరిగిన నామినేషన్ల ప్రక్రియకు ప్రజలు తండోపతండాలుగా వచ్చారని తెలిపారు. జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు విశ్వసిస్తుంటే, చంద్రబాబునాయుడు బురదజల్లే ప్రయత్నాలు మొదలు పెట్టారని దుయ్యబట్టారు. 2014–2019 మధ్య జిల్లాలో 48 కరువు మండలాలు ఉంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఒక్కటి కూడా లేకుండా సస్యశ్యామలంగా చేసినట్లు వివరించారు. ప్రభుత్వం రైతుల్ని ఆదుకునేందుకు రూ.786కోట్లు బీమా సొమ్ము విడుదల చేస్తే, చంద్రబాబునాయుడు రైతులు అల్లాడిపోతున్నారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఖండించారు. బాపట్ల నియోజకవర్గాన్ని ఒక పక్క పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తూనే మరోవైపు రోడ్ల విస్తరణ, టెంపుల్ టౌన్‌గా అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. తనకు రెండుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని తెలిపారు. తన తండ్రి వలే మూడోసారి కూడా అవకాశం కల్పించాలని కోన ప్రజల్ని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మంతెన అనంతవర్మరాజు, ఎమ్మెల్యే కోన సతీమణి రమాదేవి, కుమారుడు నిఖిల్, కోడలు అపురూప, కుమార్తె నీరజ, సినీ రచయిత కోన వెంకట్, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి, ఉయ్యూరు లీలాశ్రీనివాసరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ దొంతిబోయిన సతీరామిరెడ్డి, చేజర్ల నారాయణరెడ్డి, గవిని కృష్ణమూర్తి, కొక్కిలిగడ్డ చెంచయ్య, వడ్డిముక్కల డేవిడ్, చింతల రాజశేఖర్, పిల్లి శేఖర్, నర్రావుల వెంకట్రావు, మోర్ల సముద్రాల గౌడ్, గంగిశెట్టి రత్తయ్య, బొడ్డు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో నామినేషన్ వేసిన నందిగం

బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్ శుక్రవారం నామినేషన్ వేశారు. కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషాకు పత్రాలను అందించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధి పథకాలతో లబ్ధి పొందిన ప్రజలు తిరిగి అధికారం కట్టబెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సభలకు ప్రజలు తండోపతండాలుగా తరలి వస్తున్నారన్నారు. జన ప్రభంజనం చూస్తే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుగులేని ఆధిక్యతతో మళ్లీ అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. సామాన్యుడుగా ఉన్న తనను బాపట్ల ఎంపీగా చేసిన ఘనత ముఖ్యమంత్రిదేనని ప్రశంసించారు. తనను గెలిపించిన జిల్లా ప్రజలందరికీ రుణపడి ఉంటానని తెలిపారు. ముఖ్యమంత్రి రెండోసారి తనకు అవకాశం కల్పించారని, ఈ ఎన్నికల్లో ఎంపీగా తనకు, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

చంద్రబాబు డబ్బు, హోదా ఉన్న అభ్యర్థుల్ని బరిలోకి దింపుతున్నారని విమర్శించారు. డబ్బు బలంతో వచ్చే వ్యక్తులకు తగిన రీతిలో బుద్ధి చెప్పాలని నందిగం సురేష్ పిలుపు నిచ్చారు. ఆయన వెంట ఎమ్మెల్యే కోన రఘుపతి , చీరాల అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్, వరికూటి అమృతపాణి ఉన్నారు.



రెండో సెట్ నామినేషన్ వేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి,



కలెక్టర్ రంజిత్ బాషాకు నామినేషన్ పత్రం అందజేస్తున్న బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్



నామినేషన్‌కు ర్యాలీగా బయలుదేరిన ఎంపీ అభ్యరి సురేష్, బాపట్ల ఎమ్మెల్యే కోన

రెండో రోజు నామినేషన్లు ఇలా..

- బాపట్ల పార్లమెంట్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నందిగం సురేష్ శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ అభ్యర్థిగా తన్నీరు కృష్ణప్రసాద్, బీఎస్పీ అభ్యర్థిగా డొక్కా జగన్‌మోహన్‌రావు నామినేషన్ దాఖలు చేశారు.
- బాపట్ల అసెంబ్లీకి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కోన రఘుపతి, కోన రమాదేవి, టీడీపీ తరఫున వేగేశన నరేంద్రవర్మ భార్య నామినేషన్ దాఖలు చేశారు.
- పర్చూరు నియోజకవర్గం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి యడం బాలాజీ, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి లోకేశ్వరశర్మ, జాతీయ సమసమాజం తరఫున బాచిన రాంబాబు నామినేషన్ దాఖలు చేశారు.
- అద్దంకి నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా గొట్టిపాటి రవికుమార్ నామినేషన్ దాఖలు చేశారు.
- చీరాల నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థిగా మొద్దులూరి మాలకొండయ్య, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున అంకమ్మ గాంధీ, స్వతంత్ర్య అభ్యర్థిగా పినజాల శాంతారామ్ నామినేషన్ దాఖలు చేశారు.

వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యం

మంత్రి మేరుగు నాగార్జున , మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి

సంతనూతలపాడు(చీమకుర్తి): ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న మేమంతా సిద్ధం బస్సు యాత్ర జన ప్రభంజనం సృష్టిస్తూ దూసుకెళ్తోందని, రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, మంత్రి మేరుగు నాగార్జున, బాపట్ల పార్లమెంట్ పరిశీలకుడు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి అన్నారు. సంతనూతలపాడు పంచాయతీ కార్యాలయం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంలో శుక్రవారం వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మోదుగుల మాట్లాడుతూ వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారని.. చంద్రబాబు తన పాలనలో ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదని చెప్పారు. మళ్లీ ఈ ఎన్నికల్లో ఉత్తుత్తి వాగ్దానాలతో ప్రజల్ని మభ్యపెట్టేందుకు ముందుకొస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా నాగార్జునను, ఎంపీ అభ్యర్థిగా నందిగం సురేష్‌ను గెలిపించాలని కోరారు. మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ చీమకుర్తిలో ఈనెల 24న తాను నామినేషన్ వేస్తానని, నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారు బాబు, ఎంపీపీ బి. విజయ, జెడ్పీటీసీ సభ్యులు దుంపా రమణమ్మ, వేమా శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు బొల్లినేని కృష్ణయ్య, సొసైటీ ప్రెసిడెంట్ దుంపా యలమందారెడ్డి పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మోదుగుల, నాగార్జున

పల్లె నుంచి పార్లమెంటుకు 'నందిగం'

జగన్ పాలనలో సామాన్యుడికి అందలం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: రాష్ట్రంలో పచ్చ పార్టీ వందల కోట్లు రూపాయలు ఉన్నవారినే పార్లమెంటు అభ్యర్థులుగా నిలబెట్టి వారి నుంచి డొనేషన్ల రూపంలో భారీగా వసూలు చేసింది. ఎన్నికల్లో మంచినీళ్ల ప్రాయంగా డబ్బులు ఖర్చు చేస్తామన్నా హామీతోనే పార్లమెంటు టికెట్ ఇచ్చింది. అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఇందుకు భిన్నంగా వ్యవహరించారు. సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారు. సామాన్యులకు అసెంబ్లీతోపాటు పార్లమెంట్ టికెట్లు కేటాయించారు. గత ఎన్నికలతోపాటు తాజా ఎన్నికల్లో ఇదే పద్ధతి అవలంబించారు. గత ఎన్నికల్లో బాపట్ల పార్లమెంటు అభ్యర్థిగా అతి సామాన్యుడైన నందిగం సురేష్‌బాబును ఎంపికచేశారు. జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయానికి ఆమోద ముద్ర వేసిన ఓటర్లు ఆయన్ను మంచి మెజార్టీతో గెలిపించారు. తాజా ఎన్నికల్లోనూ నందిగం సురేష్‌ను రెండోసారి బాపట్ల పార్లమెంట్ అభ్యర్థిగా ఎంపిక చేయడం, సామాన్యులకు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న ప్రాధాన్యత తేటతెల్లం చేస్తోంది. సురేష్ అఫిడవిట్‌ను పరిశీలిస్తే ఆయన ఎంతటి సామాన్యుడో ఇట్టే తెలిసిపోతుంది. బాపట్ల పార్లమెంటు అధికారపార్టీ అభ్యర్థిగా శుక్రవారం నామినేషన్ వేసిన నందిగం సురేష్ సమర్పించిన అఫిడవిట్‌లో స్థిర, చర ఆస్తులు 78,48,075 ఉండగా, ఆయన సతీమణి పేరుతో రూ. 41,16,361 మాత్రమే ఉన్నాయి. బ్యాంక్ రుణాలు సురేష్ పేరుపై 77,05,169, భార్య పేరుతో 9,20,150 ఉన్నాయి.

క్లుప్తంగా

రౌడీషీటర్లపై నిఘా ఉంచాలి

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం జిల్లాలో ఏర్పాటు చేసిన బందోబస్తుపై విలేకరులతో మాట్లాడారు. నామినేషన్ల ప్రక్రియలో భాగంగా జిల్లాలోని ఆర్‌ఓ కార్యాలయాల వద్ద విధులు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అభ్యర్థులకు రక్షణగా వచ్చే ఆయుధాలు కలిగిన పీఎస్‌ఓలను కూడా ఆర్‌ఓ కార్యాలయంలోకి అనుమతించరాదని కోరారు. ర్యాలీలు నిర్వహించే వారి అనుమతి పత్రాలను పరిశీలించాలని చెప్పారు.

ఎమ్మెల్యే గొట్టిపాటి డబ్బులు కలిగి ఉన్నారంటే..

అద్దంకి: టీడీపీ అభ్యర్థిగా శుక్రవారం గొట్టిపాటి రవికుమార్ నామినేషన్ వేశారు. ఎన్నికల అధికారికి దాఖలు చేసిన అఫిడవిట్‌లో తనకు, తన కుటుంబ సభ్యుల ఆస్తులు, అప్పుల వివరాలు వెల్లడించారు. దాని ప్రకారం తన దగ్గర రూ.52,360, తన భార్య దగ్గర రూ.91,782, తన పెద్ద కుమారుని వద్ద రూ.25,375, రెండో కుమారుని వద్ద రూ.31,262, హెచ్‌యూఎఫ్ రూ.2,12,690తో కలపి కేవలం రూ.4,13,469 క్యాష్ ఉన్నట్లు చూపించారు. స్థిరచరాస్తుల వివరాలు పొందుపరిచారు.

మే 13న పోలింగ్ రోజు సెలవు

లక్ష్మీపురం: భారత ఎన్నికల సంఘం, సాధారణ పరిపాలన ఆంధ్రప్రదేశ్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం పోలింగ్ తేదీ మే 13న దుకాణాలు, సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి సెలవు ప్రకటించేందుకు కార్మిక కమిషనర్, విజయవాడ ఉత్తర్వులు జారీ చేసినట్లు గుంటూరు జోన్ సంయుక్త కార్మిక కమిషనర్ శుక్రవారం తెలిపారు. ఏదైనా వ్యాపారం, వాణిజ్యం, పారిశ్రామిక సంస్థ, ఇతర సంస్థల్లో ఉద్యోగం చేస్తున్న ప్రతి వ్యక్తి శాసనసభ, లోక్ సభ ఎన్నికల్లో ఓటు వేయడానికి అర్హులు. ఆయా సంస్థల యాజమాన్యం సెలవు మంజూరు చేయాల్సి ఉంటుంది.

శాసన సభ, లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో మే 13న ఎన్నికల రోజు దుకాణాలు, వ్యాపార సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికులకు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి సెలవు ప్రకటించేందుకు రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని గుంటూరు జోన్ కార్మిక శాఖ కమిషనర్ ఎస్.శ్రీనివాస్ కుమార్ శుక్రవారం తెలిపారు. పోలింగ్ జరిగే రోజు మే 13న సోమవారం దుకాణాలు, సంస్థలకు సెలవు ప్రకటించడం జరిగిందన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు అండగా ఉండాలి

- ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు
- యానాదుల ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి, వేదికపై ఎమ్మెల్యే అభ్యర్థి ఈవూరి గణేష్

చెరుకుపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అండగా ఉండి పార్టీ గెలుపునకు కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో యానాది సంఘం నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి యందేటి వెంకట సుబ్బయ్య అధ్యక్షత వహించారు. మోపిదేవి మాట్లాడుతూ జగనన్న పాదయాత్ర 112వ రోజు యానాది సంఘం జగనన్నను కలసి వారికి నివేశస్థలాలు లేక కాలువ కట్టలపైనే జీవనం సాగిస్తున్నామని, నివేశ స్థలాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అందుకు అనుగుణంగా అధికారం చేపట్టిన వెంటనే ఇళ్ల పట్టాలు ఇచ్చిన గొప్ప ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు. ఇప్పటి వరకు నిరక్షరాస్యులుగా ఉన్న యానాది సామాజికవర్గం ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఉపయోగించుకుని ఆర్థికంగా, సామాజికంగా ఎదుగుతున్నారని చెప్పారు. నియోజకవర్గంలో అనేక చోట్ల ప్రభుత్వం ద్వారా గాని, స్వచ్ఛంద సంస్థల ద్వారా యానాదులకు కాలనీలే నిర్మించామని గుర్తుచేశారు. పేద వర్గాలకు మరిన్ని సంక్షేమ ఫలాలు అందాలంటే జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలని యానాది సంఘీయులంతా వైఎస్సార్ సీపీకి అండగా ఉండి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్, పార్లమెంట్ అభ్యర్థి నందిగం సురేష్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన యానాది కులస్తులు రోగాలు బారిన పడితే తీవ్ర ఇబ్బందులు పడేవారని, దివంగత నేత డాక్టర్ రాజశేఖర రెడ్డి ప్రవేశ పెట్టిన ఆరోగ్యశ్రీ ద్వారా పేద ప్రజలు ఆరోగ్యంగా ఉన్నారని, ఆయన తనయుడు జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే ఆరోగ్యశ్రీలో మరిన్ని రోగాలను చేర్చి ఆరోగ్యశ్రీ ద్వారా రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న మనసున్న ముఖ్యమంత్రి దేశ చరిత్రలో జగనన్నే అన్నారు. కార్యక్రమంలో బౌడ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్, వైఎస్సార్ సీపీ కన్వీనర్ పైనం ఏడుకొండల రెడ్డి, రాష్ట్ర గిరిజన ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ గుండా సురేష్, సంఘ నాయకులు చేవూరి పద్మ, చౌటూరి రమేష్, తుపాకుల సురేష్, తలపాల సాంబయ్య, కొమరగిరి సురిబాబు పాల్గొన్నారు.

నవరత్న పథకాలతో ప్రతి ఇంటా వెలుగులు..

రేపల్లె రూరల్: సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటిలో వెలుగు నింపిన జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సాయంత్రం మండలంలోని ఉప్పూడి, అరవపల్లి, పెనుమూడి గ్రామాలలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. రేపల్లె అసెంబ్లీ అభ్యర్థిగా డాక్టర్ ఈవూరు గణేష్, బాపట్ల పార్లమెంటరీ అభ్యర్థి నందిగం సురేష్‌లను గెలిపించేందుకు ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వాదంతో ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు మద్దతుతో రేపల్లె నియోజకవర్గంకు సేవ చేసే అవకాశం లభించిందన్నారు. కార్యక్రమంలో బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మోపిదేవి రాజీవ్, డాక్టర్ ఈవూరు సృజన్, వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, సర్పంచి గుజ్జర్లమూడి విజయబేబి, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ ఫరీద్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 70 కుటుంబాలు చేరిక



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై రోజురోజు పార్టీలో చేరే వారి సంఖ్య భారీగా పెరుగుతోందని ఎంపీ, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండలంలోని పేటేరుకు చెందిన 70 టీడీపీ, జనసేన కుటుంబాలు వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జి కనపర్తి రవికిరణ్, మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకరరావుల సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పట్టణంలోని ఎంపీ మోపిదేవి తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పర్చూరు అభ్యర్థి బాలాజీ నామినేషన్

రెండో రోజు నాలుగు నామినేషన్లు



వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా నామినేషన్‌ను దాఖలు చేస్తున్న యడం బాలాజీ

పర్చూరు(చినగంజాం): వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థిగా యడం బాలాజీ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయన పర్చూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జీ రవీందర్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. పర్చూరు నియోజక వర్గ పరిధిలో శుక్రవారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. వీరిలో పిరమిడ్ పార్టీకి చెందిన బెండపూడి లోకేశ్వర శర్మ, జాతీయ సమసమాజ పార్టీ తరపున బాచిన రాంబాబు, స్వతంత్ర అభ్యర్థిగా షేక్ ఖాశిం సైదా నామినేషన్లు దాఖలు చేశారు.

అద్దంకి అసెంబ్లీ స్థానానికి రెండు ..

అద్దంకి: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ రెండో రోజు శుక్రవారం అద్దంకి అసెంబ్లీ స్థానానికి రెండె సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ నుంచి ఆ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ రెండు సెట్ల నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి టీపీ సునీల్ వద్ద దాఖలు చేశారు. భవాని సెంటరు నుంచి నామినేషన్ ర్యాలీగా కావడంతో గంట ముందుగానే గ్రామాల నుంచి వచ్చిన టీడీపీ సానుభూతి పరులు అక్కడ నిలవడం, వారి వాహనాలను అక్కడే నిలపడంతో రాష్ట్రీయ రహదారిపై గంట సేపు రెండు వైపులా ఆరు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. అసలే మండుటెండ, ఉక్కపోత సమయం కావడంతో బస్సుల్లో ప్రయాణికులు ఎండ వేడికి మగ్గిపోయారు. రాత్రికిరాత్రే పార్టీ మారిన బాచిన కృష్ణ చైతన్య, ఆయన తండ్రి మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య రవికుమార్ నామినేషన్‌కు హాజరు అవుతారని అందరూ భావించినా వారిరువురూ హాజరు కాలేదు.

చీరాలలో నాలుగు నామినేషన్లు దాఖలు

చీరాల: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి శుక్రవారం రెండో రోజు నాలుగు నామినేషన్లు దాఖలు చేశారని నియోజకవర్గ ఎన్నికల అధికారి జి.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ముగ్గురు అభ్యర్థులు నాలుగు నామినేషన్లు దాఖలు చేసినట్లు చెప్పారు. వీరిలో స్వతంత్ర అభ్యర్థిగా పింజన శాంతారాం రెండు సెట్లు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా లగడపాటి అంకమ్మగాంధీ ఒకటి, టీడీపీ అభ్యర్థి ఎంఎం.కొండయ్య తరపున ఆయన కుమారుడు గౌరీ అమర్‌నాథ్ నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందించారు. కార్యక్రమంలో ఏఈఆర్వోలు నాసరయ్య, కృష్ణకాంత్, చక్రవర్తి ఉన్నారు.

ప్రతి గడపకు నవరత్నాల ఫలాలు



ఉప్పుటూరు గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థి బాలాజీ

- వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ
- బాలాజీకి ఘనస్వాగతం
- హాజరైన ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, సినీ నిర్మాత కోన వెంకట్

పర్చూరు(చినగంజాం): రాష్ట్రంలో గడప గడపకు ప్రభుత్వ పథకాలందించిన వైఎస్ జగన్ మోహనరెడ్డికే ముఖ్యమంత్రిగా మళ్లీ పట్టం కట్టాలని పర్చూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి యడం బాలాజీ కోరారు. మండలంలోని పెద్దివారిపాలెం, ఉప్పుటూరు, నాగులపాలెం గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత ఆయా గ్రామాలలోని దేవాలయాలు, మసీదులు, చర్చిలలో ఆయన ప్రార్థనలు చేసి ఆయా అర్చకులు, పాస్టర్‌లు, మత పెద్దల నుంచి ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుపరిపాలన అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి అని, నవరత్నాల పేరుతో పలు సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి వాటిని ప్రజలలోకి తీసుకెళ్లిన ఘనత ఆయనకు దక్కుతోందన్నారు. పర్చూరు అసెంబ్లీకి తనను, బాపట్ల పార్లమెంట్‌కు నందిగం సురేష్‌కు ఓటు వేసి గెలిపించాలని తద్వారా వైఎస్ జగన్‌మోహనరెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకుందామని అన్నారు. కార్యక్రమంలో పర్చూరు నియోజకవర్గ పరిశీలకుడు, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, సినీ నిర్మాత కోన వెంకట్, ఎన్ఆర్ఐ కిరణ్ బాసాని, అప్పయ్య చౌదరి, ఎం.రాఘవయ్య, ఎస్.విపిన్‌బాబు, కొల్లా వెంకటరావు, జి.రమేష్, వై.హరిప్రసాద్, కొనకంటి సుబ్బారావు, మైలా చిననాగేశ్వరరావు, కట్టా రత్నరాజు, గేరా రవీంద్రనాథ్ ఠాగూర్, కె.ఇస్సాక్, గోపతోటి బాబూరావు, బండి రాంబాబు, గేరా స్వరాజ్ కుమార్, రవికుమార్, కంచెనపల్లి రమేష్, మల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రచార పర్వం

అగ్నిప్రమాదాల నివారణ పరికరాలపై అవగాహన

జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి రామకృష్ణ



హాస్పిటల్ సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చీరాల అర్బన్: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఉపయోగించే అగ్ని నిరోధక పరికరాలపై కూడా అవగాహన కలిగి ఉండాలని జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి వీవీ రామకృష్ణ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం చీరాలలోని కామాక్షి కేర్ హాస్పిటల్, ఐకాన్ హాస్పిటల్ సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మొదటి రెండు నిమిషాలు ఎంతో అమూల్యమైనవని, ఆ సమయంలో అగ్నిని నిరోధిస్తే పెద్ద ప్రమాదాలు తప్పుతాయని వివరించారు. ఒక ఎలక్ట్రికల్ పాయింట్‌లో ఎక్కువ ప్లగ్గులు పెట్టవద్దన్నారు. విద్యుత్ పరికరాలకు నిప్పు అంటుకుంటే మెయిన్ ఆపివేసి పొడి ఇసుక, డ్రై కెమికల్ పౌడర్ నిప్పు మీద చల్లాలని సూచించారు. ఎలక్ట్రికల్ పాయింటస్ ఓవర్ లోడ్ వేయవద్దన్నారు. ఇంటి నుంచి ఎక్కువ రోజులు బయటకు వెళ్లినప్పుడు ఎలక్ట్రికల్ మెయిన్ ఆపివేసి వెళ్లాలన్నారు. కాలిన శరీరంపై చల్లని నీరు పోయాలని చెప్పారు. పొగతో నిండిన గదులలో మోచేతులు, మోకాళ్లపై పాకాలని, ముక్కుకు నోటి అడ్డంగా తడిగుడ్డ నుంచి గాలి పీల్చడం ద్వారా పొగ, కార్బన్ డై ఆక్సైడ్‌ని పీల్చకుండా ఆపవచ్చన్నారు. కార్యక్రమంలో కామాక్షి కేర్ హాస్పిటల్ డైరెక్టర్ తాడివలస దేవరాజు, జీఎం తాడివలస సురేష్, డాక్టర్లు నవీన్, నరేష్ పాల్గొన్నారు.

కళా రంగానికి వైకే సేవలు చిరస్మరణీయం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి

నగరంపాలెం: కళా రంగానికి వైకే నాగేశ్వరరావు అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి అన్నారు. సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు సారథ్యంలో యువ కళావాహిని ఆధ్వర్యంలో యువ కళావాహిని వ్యవస్థాపక అధ్యక్షులు, దివంగత వైకే నాగేశ్వరరావు మూడో వర్ధంతి సందర్భంగా శుక్రవారం రాత్రి బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై ఐదుగురికి వై.కే నాగేశ్వరరావు స్మారక పురస్కారాలను అందించారు. సంస్థ అధ్యక్షుడు కళా వాచస్పతి లంక లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. సంస్థ నిర్వాహకులను ముఖ్య అతిథి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి అభినందించారు. అతిథులుగా విచ్చేసిన అదనపు జిల్లా జడ్జిలు ఆర్.శరత్ బాబు, కె.సీతారామకృష్ణారావు, బార్ కౌన్సిల్ సభ్యుడు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, రామరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సి.హెచ్.మస్తానయ్య, కార్యదర్శి బుర్రా ఉమామహేశ్వరరావులు ప్రసంగించారు. అనంతరం భాస్కరశర్మ (సుమధుర ప్రధాన కార్యదర్శి), అమృతవర్షిణి (ప్రముఖ నటి, దర్శకురాలు), చెరుకూరి సాంబశివరావు (ప్రముఖ దర్శకులు, నటుడు), కొల్లా వెంకటేశ్వరరావు (ఆలాపన అధ్యక్షుడు), పి.రంగనాయకులు (ప్రముఖ రంగస్థల నటుడు)కు పురస్కార అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు. అనంతరం వి.భాగ్యశశిధర్ దర్శకత్వంలో మాడభూషి దివాకర్‌బాబు రచించిన(యంగ్ థియేటర్ ఆర్గనైజషన్- విజయవాడ) వన్ ప్లస్ వన్ నాటిక ప్రదర్శన సందేశాత్మకంగా కొనసాగింది. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి జి.మల్లికార్జునరావు, ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు, ఎంఏ హమీద్, డి.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా పాత్ర కీలకం

ఎస్ఆర్ఎం అంతర్జాతీయ సదస్సులో వక్తల అభిప్రాయం

మంగళగిరి: ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా పాత్ర ఎంతో కీలకమైందని, ప్రజల హక్కులను, బాధ్యతలను మీడియా గుర్తు చేస్తోందని ఎస్ఆర్ఎం వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా పేర్కొన్నారు. యూనివర్సిటీ ఆడిటోరియంలో గురు, శుక్రవారాల్లో భారత్‌లో ఆధునిక మీడియా-ప్రజా సంబంధాలు అనే అంశంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల చర్చా గోష్టిలో ఆయన ప్రసంగించారు. ఈ సదస్సుకు పేరున్న పలు యూనివర్సిటీల సీనియర్ ప్రొఫెసర్లు, ప్రసార మాధ్యమ నిపుణులు,, పాత్రికేయులు హాజరయ్యారు. ప్రధానంగా మీడియా వ్యవహారాలు, ప్రజలతో మీడియాకు ఉన్న సంబంధాలు, ఆధునిక మీడియా పాత్ర, మీడియాలో ఉపయోగిస్తున్న భాష వంటి అంశాలపై వక్తలు సమగ్రంగా చర్చించి తమ అభిప్రాయాలను వెల్లడించారు. హాజరైన విద్యార్థులు ,ప్రొఫెసర్లు లేవనెత్తిన పలు సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్‌కుమార్, రూబెర్స్ యూనివర్సిటీ (యూఎస్ఏ) అసోసియేట్ ప్రొఫెసర్ మెహెలీ సేన్, న్యూస్ లాండ్రి సంస్థ సహ వ్యవస్థాపకులు అభినందన్ సేక్రి, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ ప్రమోద్ నాయర్, క్రియా యూనివర్సిటీ ప్రొఫెసర్ గుండిమెడ సాంబయ్య, అజియ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ ప్రొఫెసర్, జర్నలిస్ట్ అనూరాధ నాగరాజ్ పాల్గొన్నారు.

నేడు, రేపు భారీ స్క్రీన్‌పై ఐపీఎల్ మ్యాచ్‌లు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): క్రికెట్‌ను ప్రోత్సహించడంతో పాటు ప్రజలకు వినోదాన్ని పంచే ఉద్దేశంతో బీసీసీఐ ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తోందని బీసీసీఐ ఆపరేషన్స్ మేనేజర్ అల్విన్ గైక్వాడ్ తెలిపారు. శుక్రవారం స్థానిక లాడ్జి సెంటర్‌లోని ఓ హోటల్లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం సాయంత్రం స్థానిక బ్రాడీపేటలోని ఎల్ఈఎం స్కూల్లో భారీ ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సాయంత్రం జరగనున్న ఢిల్లీ క్యాపిటల్స్- సన్ రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌ను ఉచితంగా వీక్షించే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. దీంతోపాటు ఆదివారం మధ్యాహ్నం కోల్‌కొత్తా నైట్ రైడర్స్- రోయల్ చాలెంజర్స్ బెంగళూరు, సాయంత్రం పంజాబ్ కింగ్స్- గుజరాత్ టైటాన్స్ మధ్య మ్యాచ్‌ను కూడా భారీ స్క్రీన్‌పై వీక్షించవచ్చని వెల్లడించారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంఎస్‌పీవీ రమణమూర్తి మాట్లాడుతూ ఎనిమిదేళ్ల నుంచి పట్టణంలో భారీ స్క్రీన్‌పై మ్యాచ్‌లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ విషయంలో బీసీసీఐ పాత్ర ఎంతో కీలకమన్నారు. స్టేడియంలో నేరుగా చూసే అనుభూతి కలుగుతుందని చెప్పారు.

అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టండి



మేదరమెట్లలో గ్రామస్తులతో మాట్లాడుతున్న అసెంబ్లీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి, వైవీ భద్రారెడ్డి

- అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి
- మేదరమెట్లలో ఇంటింటి ప్రచారం

మేదరమెట్ల: అభివృద్ధి చూసి తమ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని.. వైఎస్సార్ సీపీ అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి కోరారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్లలో ఇంటింటి ప్రచారాన్ని ఏఎంసీ మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డితో కలసి శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కులమతాలకు, పార్టీలకు అతీతంగా గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు నిర్మించినట్లు చెప్పారు. గ్రామంలోని ప్రజలతో పాటు సమీప గ్రామాల ప్రజానీకానికి మెరుగైన వైద్యసేవలను అందచేందుకుగాను తమసొంత నిధులతో గతంలోనే వైవీ సోదరులు వైద్యశాలను నిర్మించారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వైద్యశాలలు, పాఠశాలలను మెరుగైన సదుపాయాలను ఏర్పాటు చేసి అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. అతి తక్కువ వ్యయంతో వివాహాది శుభకార్యక్రమాలను నిర్వహించుకునేందుకు కల్యాణ మండపం నిర్మించారని తెలిపారు. తొలుత గ్రామానికి వచ్చిన నేతలను మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని హారతులతో పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు. సోమవరప్పాడులోని నాభిశిల వద్ద కొబ్బరికాయలు కొట్టి ప్రచారాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నియోజకవర్గం పార్టీ పరిశీలకుడు మారం వెంకారెడ్డి, సర్పంచి బొనిగల ఎలిశమ్మ, మాజీ సర్పంచులు జజ్జర ఆనందరావు, పేరం నాగలక్ష్మి, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్లు కోయి అంకారావు, యర్రం రత్నారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరికలు..

కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి, మాజీ ఏఎంసీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీ కండువాలను కప్పుకున్నారు. పార్టీలోకి చేరిన వారిని ఇరువురు నేతలు సాదరంగా ఆహ్వానించారు.

అందరి కోసం ఉంటాం.. కష్టించి పనిచేస్తాం!

- చీరాల వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి వెంకటేష్ గెలుపు కోసం విస్తృత ప్రచారం
- హాజరైన వెంకటేష్ సతీమణి గీత, ఎమ్మెల్యే కుమార్తెలు గోరంట్ల సుధారాణి, శాంతిప్రియ



కొత్తపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కరణం గీత, సుధారాణి, శాంతిప్రియ, నిరుపమ

చీరాల: నియోజకవర్గ ప్రజలందరికీ కోసం మేము అండగా ఉంటాం, కష్టించి పనిచేస్తామని వైఎస్సార్ సీపీ చీరాల అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ సతీమణి గీత, ఎమ్మెల్యే బలరాం కృష్ణమూర్తి కుమార్తెలు గోరంట్ల సుధారాణి, శాంతిప్రియ పేర్కొన్నారు. శుక్రవారం కొత్తపేట గ్రామంలో వెంకటేష్‌కు మద్దతుగా విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఈసందర్భంగా కరణం గీత, గోరంట్ల మాధవి, వడ్లపట్ల శాంతిప్రియ మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమాన్ని సృష్టించి పారదర్శకంగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే జమ చేస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీకే దక్కుతోందన్నారు. కులమతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు ద్వారా అర్హులందరికీ మేలు చేకూరుస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలన్నారు. ఎమ్మెల్యేగా కరణం వెంకటేష్, ఎంపీగా నందిగం సురేష్‌ను గెలిపించుకుని ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ జెండాను చీరాలలో ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నిరుపమ, వైస్ చైర్మన్ జైసన్‌బాబు, క్లస్టర్-2 మహిళా విభాగం అధ్యక్షురాలు గోలి స్వాతి, గోలి రవి, రాష్ట్ర మహిళా జాయింట్ సెక్రటరీ మల్లెల లలిత, కోఆప్షన్ సభ్యులు షేక్ ఫాతిమా, షేక్ కబీర్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.వైష్ణవి, ఎం.బ్రహ్మయ్య, శర్మ, శరత్, వాసిమళ్ల బ్రదర్స్, చీరాల రూరల్ మండలం మహిళా అధ్యక్షురాలు ఎస్.వెంకటేశ్వరమ్మ, జూబ్లి పాల్గొన్నారు.